నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, సోమవారం 15 ఏప్రిల్ 2024 | HYDERABAD


నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ కాకర్ల సుబ్బారావు వర్ధంతి సందర్భంగా దవాఖానలోని ఆడిటోరియంలో ఆదివారం ఆంకో ఇమేజింగ్‌పై సదస్సు జరిగింది. ఈ సదస్సును డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప ప్రారంభించారు. మెడికల్ ఆంకాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సదాశివుడు, ఆంకాలజీ వైద్యులు డాక్టర్ సెంథిల్ రాజప్ప క్యాన్సర్ చికిత్సలో వస్తున్న ఆధునిక వైద్య విధానం, నూతన ఆవిష్కరణలు, నివారణలపై చర్చించారు. – ఖైరతాబాద్, ఏప్రిల్ 14





ఆదివారం తెలంగాణభవన్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ మహిళా నేతలు

# బీసీల సత్తా చాటుతాం..

## చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో ఐక్యత చూపుదాం

### ఈ అవకాశాన్ని చేజార్చుకుంటే అరిగోసే అంటున్న బీసీలు

### కాంగ్రెస్ నేతల దురహంకార వ్యాఖ్యలపై బీసీ సంఘాల ఆగ్రహం

### లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరిక

బీసీలపై కాంగ్రెస్ పార్టీ కత్తి దూస్తున్నది. ఆ పార్టీ నేతల దురహంకార మాటలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. దమ్ముంటే ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని గెలిపించుకోవాలన్న కాంగ్రెస్ నేతలపై బీసీ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతామని బీసీ నేతలు స్పష్టం చేస్తున్నారు. చేవెళ్ల ఎంపీ స్థానంలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సత్తా చాటాల్సిన సమయం వచ్చిందని బీసీ వర్గాలు పేర్కొంటున్నాయి. బీసీలకు టికెట్ల కేటాయింపులో వివక్ష చూపడమే కాకుండా..బీసీలను అణగదొక్కేందుకు కాంగ్రెస్ నేతలు చేస్తున్న కుటిల రాజకీయాలను ప్రస్తుత లోక్ సభ ఎన్నికల్లో తిప్పికొట్టాలని నేతలు పిలుపునిస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మొదటి నుంచీ బీసీల సాధికారతకు పాటుపడుతున్నదని, ఆ పార్టీ అవకాశం కల్పించిన బీసీ అభ్యర్థిని ఎలాగైనా గెలిపించుకుని తీరాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. ఈ అవకాశాన్ని చేజార్చుకుంటే బీసీలు గోస పడక తప్పదని హెచ్చరిస్తున్నారు. ఎన్నికల్లో అందరూ సంఘటితమై పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని, బీసీలంతా ఏకమై.. సత్తాచాటి అగ్రవర్ణాల నేతలకు బుద్ధి చెబుదామని పిలుపునిస్తున్నారు. – *రంగారెడ్డి, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ)*

### బీసీ నేత కాసానిని గెలిపించుకుందాం..



బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి గత 45 ఏండ్లుగా కాసాని జ్ఞానేశ్వర్ కృషి చేస్తున్నారు. ఆయన్ను రానున్న ఎన్నికల్లో ఎంపీగా గెలిపించుకుంటే బీసీలకు అన్ని విధాలా న్యాయం జరుగుతుంది. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు ఆరు ఎంపీ సీట్లు కేటాయించడం చాలా సంతోషకరం. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలమంతా ఏకమై చేవెళ్ల ఎంపీగా కాసానిని గెలిపించుకుందాం..

*– మద్దూరి పాండు, బీసీ నేత, షాబాద్ మండలం*

### బీసీల సత్తా ఏమిటో చూపాలి..



96 కులాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడిన గొప్ప నేత కాసాని జ్ఞానేశ్వర్. అలాంటి వ్యక్తికి కేసీఆర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకా శం కల్పించడం చాలా సంతోషకరం. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలమంతా ఏకమై కాసానిని భారీ మెజార్టీతో గెలిపించి మన సత్తా ఏమిటో చూపాలి. *– దొనికెల రాందేవ్ యాదవ్, బీసీ నాయకుడు షాబాద్*

### బీసీల చైతన్యాన్ని చాటాలి..



బీసీలపై అహంకార పూరితంగా మాట్లాడుతున్న రాజకీయ పార్టీలు, నేతలకు తగిన బుద్ధి చెప్పాలి. అందుకోసం రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల అభ్యర్థి అయిన కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి మన సత్తా, ఐక్యతను చాటాలి. బీసీలు తలుచుకుంటే ఏదైనా సాధిస్తారని చూపాలి.


*– ఆంజనేయులు, పద్మశాలీ సంఘం గౌరవ అధ్యక్షుడు, ఆల్విన్ కాలనీ డివిజన్*

### దురహంకార మాటలు సమంజసంకాదు



కాంగ్రెస్ నాయకులు బీసీ ఓటర్లపై అహంకార పూరితంగా మాట్లాడడం సమంజనం కాదు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని బీసీలందరూ పార్టీలు, రాజకీయాలకు అతీతంగా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి అయిన కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని మన సత్తా ఏమిటో అడ్డదిడ్డంగా మాట్లాడుతున్న నాయకులకు చూపాలి. దురహంకార మాటలు మాట్లాడే వారికి తగిన బుద్ధి చెప్పాలి.

*–తిరందాసు విష్ణు, బీసీ నేత, ఆల్విన్ కాలనీ డివిజన్*



### బీసీల సత్తా చూపుతాం



చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీసీల సత్తా చాటుతాం. కారు కూతలు కూస్తున్న మోహన్ రెడ్డి లాంటి వారికి తగిన గుణపాఠం చెప్తాం. బీసీలను చులకన చేసి మాట్లాడిన వారికి తాము ఏంటో చూపిస్తాం. మహేశ్వరం నియోజకవర్గంలో ఉన్న బీసీ కులాల సభ్యులందరం ఏకమై కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం.

*– దశరథ, ముదిరాజ్ సంఘం నాయకుడు, వెంకటాపూర్, బడంగ్‌పేట*

### పార్టీలకతీతంగా గెలిపించుకోవాలి



బీఆర్‌ఎస్ పార్టీ బీసీ ఉద్యమ నేత కాసాని జ్ఞానేశ్వర్‌కు చేవెళ్ల ఎంపీ టికెట్ ఇవ్వడం హర్షణీయం. పార్టీలకతీతంగా ఆయనను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి బీసీపైనా ఉన్నది. బీసీల్లో ఉన్న 96 కులాల ఐక్యతకు కాసాని ఎంతో కృషి చేశారు. వచ్చిన అవకాశాన్ని వదులుకుంటే రానున్న రోజుల్లో ఏ పార్టీ కూడా బీసీలకు టికెట్ ఇచ్చేందుకు ముందుకు రాదు. బీసీలపై అడ్డదిడ్డంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోం.. మోహన్‌రెడ్డి.. తస్మాత్ జాగ్రత్త .. బీసీల సత్తా చూపుతాం..

*–పెండ్యాల ఉమేశ్‌కుమార్, రాష్ట్ర వృత్తి దారుల సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు*

### ఐక్యతను చాటాల్సిన సమయం..



బీసీల ఓట్లు లేనిదే ఏ నాయకుడూ ఎన్నికల్లో విజయం సాధించలేడు. సోషల్ మీడియా సాక్షిగా మోహన్‌రెడ్డి బీసీలను హేళన చేస్తూ మాట్లాడటం సమంజసం కాదు. బీసీ ఓటరులారా.. ఇకనైనా మెల్కొని బీసీ నాయకుడైన కాసాని జ్ఞానేశ్వర్‌ను రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకుని మన ఐక్యతను చాటాల్సిన సమయం వచ్చింది. లేకపోతే అగ్రవర్ణాల వారు చేస్తున్న ఆరోపణలు నిజమవుతాయి.. అరిగోస తప్పదు.

*– చంద్రశేఖర్‌గౌడ్, బీసీ సంఘం నాయకుడు, బండ్లగూడ*

### బీసీ నాయకుడిని గెలిపించుకుందాం



కొన్నేండ్లుగా బీసీలు రాజకీయంగా వెనుకబడి పోతున్నారు. జనాభాలో బీసీల సంఖ్య అధికంగా ఉన్నా.. పాలకుల్లో మాత్రం తక్కువగా ఉన్నది. బీసీలందరూ సమష్టిగా కృషి చేసి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి అయిన కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి. ఆయన బీసీల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు.

*– రమేశ్, నాయీబ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు, వికారాబాద్*

### కాసానికే ఓటేయాలి



రానున్న ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌ను చేవెళ్ల నుంచి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి. ఆయన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభ్యున్నతికి ఎంతో కృషి చేశారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచారు. అలాంటి వారు పార్లమెంట్‌లోకి వెళ్తే పేదల సమస్యలు పరిష్కరమవుతాయి. బీసీలందరూ కాసానికే ఓటేయాలి.

*– గుర్రంపల్లి యాదగిరి, అత్తాపూర్, బండ్లగూడ*

### బీసీలు ఏకమవ్వాలి..



బీసీలందరూ ఏకం కావాల్సిన సమయం వచ్చింది. బీసీలను కించపరిచేలా మాట్లాడిన మోహన్‌రెడ్డి లాంటి వారికి తగిన బుద్ధి చెప్పాలంటే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి అయిన కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి. పార్టీలకతీతంగా ఏకమై మన సత్తాను చాటుదాం..

*– పటేల్ జగదీశ్వర్, వీరశైవ సమాజం నియోజకవర్గ అధ్యక్షుడు, పరిగి*

### బీసీల్లో పెరుగుతున్న ఐక్యత



బీసీల్లో ఇప్పుడిప్పుడే ఐక్యత వస్తున్నది. పాలకులు విభజించి పాలించడంతో ఐక్యత లోపించింది. బీసీలందరినీ ఏకతాటి పైకి తీసుకొచ్చేందుకు కృషి చేసిన కాసాని జ్ఞానేశ్వర్‌ను ఈ పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి.

*– ముకుంద నాగేశ్వర్, రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి*

### వారికి తగిన బుద్ధి చెప్పాలి



బీసీలపై అగ్రవర్ణ నాయకుల వ్యాఖ్యలు సమంజసం కావు. బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చి.. బీసీలను అవమానపర్చేలా చులకనగా మాట్లాడడం తగదు. అగ్రవర్ణాల వారికి తగిన బుద్ధి చెప్పాలంటే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి అయిన కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుని మన సత్తా చాటాలి.

*– వెంకటేశ్, దాచారం, వికారాబాద్*

### కాసాని విజయం ఖాయం



96 కులాల బీసీ ఐక్య వేదికను ఏర్పాటు చేసి అందరినీ ఒక్క తాటిపైకి తీసుకొచ్చిన కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయం. ఇప్పటివరకు చేవెళ్ల పార్లమెంట్‌లో బీసీలకు ఎంపీ టికెట్ దక్కలేదు. కేసీఆర్ బీసీలను గుర్తించి కాసానికి ఎంపీ టికెట్ కేటాయించడం హర్షణీయం. కులమతాలకు అతీతంగా కారు గుర్తుకు ఓటేసి కాసానిని గెలిపించుకుందాం.

*– రవికాంత్, ముదిరాజ్ సంఘం తాండూరు నియోజకవర్గ అధ్యక్షుడు*

### కాసాని గెలుపు.. బీసీల అభివృద్ధికి మలుపు



కాసాని గెలుపు.. బీసీల అభివృద్ధికి మలుపు. బడుగు, బలహీన వర్గాల నాయకుడు జ్ఞానేశ్వర్‌కు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఎంపీ టికెట్ ఇవ్వడం అభినందనీయం. పార్టీల కతీతంగా బీసీలందరం ఏకమై గెలిపించుకోవాలి. అధికారం, స్వార్థం కోసం పార్టీలు మారిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలను ఓడించాలి. కాసానిని పార్లమెంట్‌కు పంపిద్దాం.

*– వీణా, మాజీ చైర్‌పర్సన్, తాండూరు మార్కెట్ కమిటీ*

# పార్సీగుట్ట నుంచే.. పార్లమెంట్‌కు..

## పద్మారావుకు కలిసొస్తున్న సెంటిమెంట్

### ఎన్నిక ఏదైనా ఆ ప్రాంతం నుంచే ప్రచారం

### 4 సార్లు అసెంబ్లీ ఎన్నికల్లోనూ అక్కడి నుంచే

### నేడు ఎన్నికల ప్రచార పాదయాత్ర ప్రారంభం

### పెద్ద సంఖ్యలో పాల్గొననున్న కార్యకర్తలు, అభిమానులు



సికింద్రాబాద్, ఏప్రిల్ 14 ( నమస్తే తెలంగాణ ) : పద్మారావు గౌడ్ రాజకీయ జీవితంలో పార్సీగుట్టది ప్రత్యేకమైన పాత్ర. ఎన్నికలు ఏవైనా.. ఆయన అక్కడి నుంచే ఎన్నికల ప్రచార పాదయాత్ర ప్రారంభిస్తారు. ఈ సెంటిమెంట్ ప్రతీసారి వర్కవుట్ అవుతూనే ఉన్నది. ఇప్పటికీ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన పజ్జన్న..ప్రతి ఎన్నికల్లోనూ పార్సీగుట్టనే తొలుత ప్రచార ప్రాంతంగా ఎంచుకుంటారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా రూ. 800 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టి ప్రజల మన్ననలు పొందారు. ఇప్పుడు లోక్‌సభ బరిలో ఉన్నారు. ప్రజలతో ఉన్న అనుబంధం, అభిమానం కారణంగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పద్మారావుగౌడ్‌ని పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ అభ్యర్థిగా బరిలో నిలిపారు. అందులో భాగంగానే ఎన్నికల ప్రచార పాదయాత్రను సోమవారం పద్మారావు ప్రారంభించనున్నారు. ఎప్పటిలాగానే తనకు అన్ని విధాలా సెంటిమెంట్‌గా భావిస్తున్న పార్సీగుట్టనే లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి కూడా వేదికగా చేసుకున్నారు. గతంలో 2004, 2014, 2018, 2023 జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్సీగుట్ట నుంచే ఎన్నికల ప్రచారం మొదలు పెట్టి విజయదుందుభి మోగించారు. ఇప్పుడు అదే ఉత్సాహంతో పార్సిగుట్ట నుంచే ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ఈ పాదయాత్రలో స్థానిక కార్పొరేటర్ శైలజతో పాటు నియోజకవర్గ కార్పొరేటర్లు ,పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నారు. పద్మారావు అభిమానులు, బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు కూడా స్వచ్ఛందంగా ఈ కార్యక్రమానికి తరలి రానున్నారని బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు.

#### పజ్జన్నతోనే జనం..

అందరివాడుగా గుర్తింపు పొందిన పజ్జన్నకు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు జేజేలతో ఆహ్వానిస్తున్నారు. పజ్జన్న గెలుపు ఖాయమైందంటూ అభిమానులు సోషల్ మీడియాలో అభిమానాన్ని చాటుకుంటున్నారు. డిప్యూటీ స్పీకర్‌గా, మంత్రిగా అత్యున్నత పదవులు చేపట్టిన పద్మారావు.. ప్రజలతో అనుబంధాన్ని ఎప్పుడూ వదులుకోలేదు. ఎలాంటి హోదాలో ఉన్నా.. ఆయన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటారు. తెలంగాణ స్వరాష్ట్ర సాకారంలో ఉద్యమ రథ సారథి కేసీఆర్ ఆదేశాలతో కీలకపాత్ర పోషించారు. అప్పటి నుంచి కేసీఆర్ అడుగు జాడల్లో నడుస్తూ ప్రజలతో మమేకమయ్యారు. కాగా, 'నమస్తే తెలంగాణ'తో పద్మారావు గౌడ్ ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రతి ఎన్నికల్లో ప్రోత్సహిస్తూ అండగా నిలుస్తున్న కేసీఆర్‌కు రుణపడి ఉంటానని పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జెండా ఎగురడం ఖాయమని చెప్పారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ వైఫల్యం చెందిందని విమర్శించారు. కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. తెలంగాణ ప్రజల అభివృద్ధికి నిరంతరం శ్రమించే పార్టీ కేవలం బీఆర్‌ఎస్సే అని నినదించారు. ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నదని, విజయం తథ్యమని చెప్పారు.

# ప్రపంచ దేశాలు ప్రశంసించేలా..

### హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన కేసీఆర్

### మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి

బొల్లారం/మల్కాజిగిరి, ఏప్రిల్ 14: ప్రపంచ దేశాలు ప్రశంసించేలా హైదరాబాద్‌ను కేసీఆర్ అభివృద్ధి చేశారని మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, మాల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి బొల్లారం కంటోన్మెంట్ పార్కులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వాకర్స్‌తో మాట్లాడి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ..ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పేదల సంక్షేమాన్ని మరిచిందని, ఆరు గ్యారెంటీలంటూ ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి విమర్శించారు. కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి, లోక్‌నాథ్, మల్లేశ్‌గౌడ్, డోలి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మచ్చ బొల్లారంలోని పార్కులో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

# ఎస్సై వేషమేసి... మోసాలు



### పోలీస్ శాఖలో నేరుగా ఉద్యోగాలంటూ చీటింగ్

### నిందితుడి అరెస్ట్

సిటీబ్యూరో: ఎస్సై వేషమేసి..పోలీస్ శాఖలో నేరుగా ఉద్యోగాలిపిస్తానని మోసాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మీ పెరుమాల్ కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా దొంతికుంట తండాకు చెందిన కేదవాత్ సోమ్లు నాయక్ ఇంటర్ వరకు చదివాడు. ఆర్మీలో చేరి ఆరు నెలల శిక్షణ తీసుకొని మధ్యలో వదిలేశాడు. 2004లో అసోం రైఫిల్స్‌కు ఎంపికైనా.. శిక్షణ సమయంలో అనారోగ్యంతో మధ్యలోనే వదిలేసి వచ్చాడు. ఆ తరువాత ఉమ్మడి ఏపీలో పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు ప్రయత్నించి విఫలమయ్యాడు. జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేసుకుంటున్నాడు. యూనిఫామ్ డ్యూటీ చేయాలనే కోరికతో 2012లో పోలీసు యూనిఫామ్ కుట్టించుకొని, తాను ఎస్సైనని కొందరికీ, కానిస్టేబుల్‌నని మరికొందరికీ చెప్పుకుంటూ తిరగడం మొదలు పెట్టాడు. అతడి స్వగ్రామం, ఆ చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు నిజంగానే సోమ్లు నాయక్ ఎస్సై అని నమ్మడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో ఉద్యోగాల కోసం ప్రయత్నం చేసే వారిని లక్ష్యంగా చేసుకున్న సోమ్లు..పోలీసుల ఉద్యోగాలు డైరెక్ట్‌గా ఇప్పిస్తానంటూ నమ్మిస్తూ అమాయకుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేశాడు. ఇలా రూ. 11 లక్షల వరకు వసూలు చేసిన సోమ్లునాయక్‌కు.. రూ. 2 లక్షలు ఇచ్చిన బంజారాహిల్స్‌కు చెందిన గౌరిశంకర్‌కు ఇతడి వ్యవహారంపై అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నకిలీ ఎస్సై భాగోతం వెలుగులోకి వచ్చింది. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు.. యూనిఫాం, క్యాప్ ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

### సీడీఎఫ్‌డీలో నేడు జాతీయ సెమినార్

సిటీబ్యూరో, ఏప్రిల్ 14(నమస్తే తెలంగాణ) : ఉప్పల్‌లోని సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్‌లో సోమవారం జాతీయ సెమినార్ జరగనున్నది. పునరుత్పత్తి వ్యవస్థలో అత్యంత కీలకమైన కణ విభజన, ఫలధీకరణ, క్రోమోజోముల విభజన వంటి అంశాలను ఈ సదస్సులో చర్చించనున్నారు.

### అగ్ని ప్రమాదాలపై అవగాహన తప్పనిసరి

సిటీబ్యూరో, ఏప్రిల్ 14 ( నమస్తే తెలంగాణ ) : అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్ని మాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం అగ్ని మాపక సేవల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలు, గోడ పత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు.

# రూ. 36.98 కోట్లతో మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్

### రంగంలోకి దిగనున్న 166 అత్యవసర బృందాలు



సిటీబ్యూరో, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : వచ్చే వర్షాకాల సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జీహెచ్‌ఎంసీ సన్నద్ధమవుతున్నది. ఈ మేరకు జూన్ నుంచి అక్టోబరు 31 వరకు మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పనకు సిద్ధమైంది. స్టాటిక్ లేబర్, మినీ మొబైల్ టీమ్‌లు, వాహనాలు, మొబైల్ ఎమర్జెన్సీ బృందాల ఏర్పాటులో భాగంగా సర్కిళ్ల వారీగా టెండర్లను ఆహ్వానించి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నారు. ప్రతి ఏటా తరహా ఈ ఏడాది కూడా సుమారు రూ. 36.98 కోట్లతో ప్రత్యేక బడ్జెట్‌తో మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ అమలు చేయనున్నారు. ఇప్పటికే వర్షాకాలం ముందే నాలాల పూడిక తీత పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. ఈ పనులను నెలాఖరు నాటికల్లా పూర్తి చేసే దిశగా చర్యలను వేగవంతం చేశారు.

#### వరద ప్రభావిత ప్రాంతాల్లో..

వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు 166 అత్యవసర బృందాలను రంగంలోకి దింపనున్నారు. ఇందులో 64 మొబైల్, 104 మినీ మొబైల్ బృందాలు ఉండగా, 160 స్టాటిక్ లేబర్స్ టీమ్స్ ఉంటాయి. మొబైల్, మినీ మొబైల్ ఎమర్జెన్సీ టీమ్‌లలో షిఫ్టు వారీగా ప్రతి టీంలో నలుగురు కార్మికులు ఉంటారు. వివిధ సాధనాలను అందుబాటులో ఉంచుతారు. నీరు నిలిచిపోయిన ప్రాంతాలు, క్యాచ్‌పిట్ల వద్ద నిలిచిన నీటిని తొలగిస్తారు. అలాగే ప్రతి చెరువుకు ఒక ఇన్‌చార్జితో పాటు ఇద్దరిని కేర్ టేకర్ (పర్యవేక్షకులు)గా నియమించనున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద అంచనా బట్టి దిగువకు చెరువు నీటిని విడుదల చేయడం, ఎప్పటికప్పుడు చెరువుల వరదపై అప్రమత్తంగా ఉండటం వంటి చర్యలు చేపడతారు. ఎన్‌ఎన్‌డీపీ పనులు జరిగే స్థలాల్లో ఎలాంటి ప్రమాదాలు వాటిల్లకుండా బారికేడ్ల ఏర్పాట్లు, రోడ్లు మూసివేత, హెచ్చరిక బోర్డులు ఏర్పాటుపై దృష్టి సారిస్తారు.